# రాజకీయాలకు అతీతంగా సమస్యలను పరిష్కరిస్తాం

- రాయిగూడెంలో ప్రజల ముందుకు ప్రజా దర్బార్
- న్యాయమైన సమస్యను పరిష్కరించే బాధ్యత నాదే:మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు.రాయిగూడెం,అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయితీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు.ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియని,మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నామని వెల్లడించారు.

**క్లస్టర్ల వారీగా.. క్షుణ్ణంగా పరిష్కారం**

రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి తెలియజేశారు.ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా,ప్రతి పంచాయితీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**శాఖల వారీగా సమీక్షలు**

ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా, వడివడిగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు.మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉందని అసాధ్యమైన హామీలు నేను ఇవ్వను కానీ.. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాదని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపి సునీల్ దత్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ,అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, తహసిల్దార్ రామ్ ప్రసాద్, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

## మానవత్వం చాటుకున్న డాక్టర్ శ్రీమన్నారాయణ



- జీజీహెచ్‌కు కూలర్ల విరాళం
- సొంత ఖర్చుతో రూ. లక్ష విలువైన వస్తువుల పంపిణీ
- రోగుల సౌకర్యార్థం ఆర్ఎంఓ చొరవ.. సూపరింటెండెంట్ అభినందన

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి ఆర్ఎంఓ, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జి. శ్రీమన్నారాయణ తన ఉదారతను చాటుకున్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రోగులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో శనివారం ఆయన సొంత ఖర్చులతో కూలర్లను కొనుగోలు చేసి ఆసుపత్రికి విరాళంగా అందజేశారు.

**రోగుల సేవే పరమావధి...**

వేసవి తాపం తీవ్రమవుతున్న తరుణంలో ఆసుపత్రిలోని వార్డుల్లో ఉన్న రోగులకు ఉపశమనం కలిగించేందుకు డాక్టర్ శ్రీమన్నారాయణ దాదాపు లక్ష రూపాయలు వెచ్చించి ఈ కూలర్లను కొనుగోలు చేశారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేదవ్యాస్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలోనే కాకుండా, వ్యక్తిగతంగా రోగుల సంక్షేమం కోసం శ్రీమన్నారాయణ చేసిన ఈ కృషి అభినందనీయమని కొనియాడారు. తోటి వైద్యులు, సిబ్బంది ఆయన సేవా దృక్పథాన్ని అభినందించారు.

## ఓటర్ల జాబితా మ్యాపింగ్ వేగవంతం చేయాలి

- మ్యాపింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సమీక్ష
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తహసిల్దార్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యాపింగ్ శాతాన్ని పెంచడం అత్యవసరమని, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బీఎల్ఓలను సంప్రదించి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, మరణించిన వారు మరియు డబుల్ ఓటర్ల వివరాలను జాబితా నుండి తొలగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాములు, ఆర్డీఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల స్వయం ఉపాధికి శివ సాయి సంస్థ చేయూత

- ఇక్బాల్ అహ్మద్ నగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం*
- మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం: నిర్వాహకులు
- పాల్గొన్న కార్పొరేటర్ అభ్యర్థి కల్వచర్ల రాధిక, వార్డు సభ్యురాలు సతరాసి అరుణ

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** మహిళల అభ్యున్నతే లక్ష్యంగా శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంస్థ మరో ముందడుగు వేసింది. జిల్లా కేంద్రంలోని ఇక్బాల్ అహ్మద్ నగర్ బస్టాండ్ సమీపంలో మహిళలకు కుట్టు పనిలో మెలుకువలు నేర్పించే శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ నాగుల కమల ఆధ్వర్యంలో, షేర్ హోల్డర్ నాగుల శ్రీధర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి కల్వచర్ల రాధిక, కాంగ్రెస్ వార్డు సభ్యురాలు సతరాసి అరుణ హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ఇటువంటి శిక్షణ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని అభినందించారు. ఈ కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు పనిలో వృత్తిపరమైన నైపుణ్యాలను నేర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీని ద్వారా మహిళలు సొంతంగా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం శివ సాయి సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్లు బుర్ర రజిత, నాగవేణి ఇంద్ర, మేడిశెట్టి పుష్పలీల, బీర్కా సుజాత, దుర్గం సౌభాగ్యలక్ష్మి చంద్రయ్య, రాపాల సుమలత పాల్గొన్నారు. అలాగే గోదావరిఖని బ్రాంచ్ సీనియర్లు పెనుగొండ స్వాతి, పుల్లూరి కె.జి. రాణి, బ్రాంచ్ మేనేజర్ జిల్లా లావణ్య, అసిస్టెంట్ మేనేజర్ మాచర్ల మౌనిక, అకౌంటెంట్లు రాగి ప్రీతి, సిర్ర మమత తదితర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- నస్పూర్ కలెక్టరేట్‌లో 'పోషణ్ పక్వాడ' 8వ విడత ముగింపు వేడుకలు
- తొలి వెయ్యి రోజుల పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను కోరారు. శనివారం నస్పూర్ కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోషణ్ పక్వాడ' (పోషణ పక్షోత్సవాలు) 8వ విడత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనితతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 9 నుండి 23వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులలో మొదటి ఆరు సంవత్సరాల కాలంలో మెదడు అభివృద్ధి వేగంగా ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. శిశువు పుట్టిన మొదటి వెయ్యి రోజుల కాలం అత్యంత కీలకమని, ఆ సమయంలో సరైన పోషణ అందిస్తేనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**అంగన్‌వాడీల్లో ఆటల ఆధారిత విద్య...**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటల ఆధారిత విద్యను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పోషణ పంచాయతీలు, సామాజిక అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. నేటి తరం పిల్లల్లో పెరుగుతున్న 'స్క్రీన్ టైమ్' (సెల్‌ఫోన్, టీవీ వాడకం) తగ్గించేలా తల్లిదండ్రులకు సరైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు.

**శ్రీమంతాలు - అక్షరాభ్యాస వేడుకలు...**

ఈ కార్యక్రమంలో భాగంగా నలుగురు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను కలెక్టర్ సందర్శించి, స్థానిక ఆహార పదార్థాల ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### సీఐటీయూ డిమాండ్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు గుమాస ప్రకాష్, రంగు రాజేశం డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా రైస్ మిల్ హమాలీ యూనియన్ మహాసభల్లో వారు మాట్లాడారు. హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన హమాలీ కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన వారికి రూ. 9,000 పెన్షన్, ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం అందించాలని పట్టుబట్టారు. అనంతరం యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గుమాస ప్రకాష్, అధ్యక్షుడిగా ఎం. సురేందర్, కార్యదర్శిగా బి. చిన్నయ్య, కోశాధికారిగా కొమురయ్య ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాతపై ప్రభుత్వానికి కక్షెందుకు!

- తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- గట్టుభూత్కూర్లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**రాజముద్ర న్యూస్, కరీంనగర్ :** అన్నదాతలపై ప్రభుత్వానికి కక్ష ఎందుకని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తూతూమంత్రంగా సాగుతోందని, కనీస వసతులు లేవని, పంటలు చేతికి వచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు పోసి రోజుల తరబడి వేచి చూస్తున్నా కాంటా వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు సాగునీరు ఇవ్వకుండా లక్షల ఎకరాలను ఎండబెట్టిన ప్రభుత్వం ఇప్పుడు రైతుల చేతికి వచ్చిన కొద్దిపాటి పంటలను కూడా కొనకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చొప్పదండి నియోజకవర్గం వ్యాప్తంగా 25 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల ప్రారంభాలతోనే సరి పెట్టారని మిల్లర్లు అలాట్మెంట్ కాలేదన్నారు. సకాలంలో ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లర్లు, దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు నీరందించి భూమికి బరువయ్యే పంట పండిస్తే ప్రతి గింజను కొనుగోలు చేసి వారం రోజుల్లోపు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు చేపట్టాలని, తప్ప, పాలు పేరుతో కటింగ్ చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు కంకణాల విజేందర్రెడ్డి, వేముల దామోదర్, నాయకులు బొడ్డు మల్లేశం, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## ప్రజాసేవలో బోనగం రమేష్



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** మండలకేంద్రంలోని 1 వ వార్డ్ మెంబెర్ బోనగం రమేష్ గౌడ్ ప్రజల సేవర్తం శివాజీ విగ్రహం నుండి పోలీస్ స్టేషన్ వరకు సిసి రోడ్డు గుంతలు పడి ఉండగా వాటిని కాంట్రాక్టర్ బాలయ్య సహాయంతో గుంతలను పూడ్చి వేశారు.ఈ సందర్బంగా వార్డ్ ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అధికారులు, ప్రజలు 1 వ వార్డ్ సభ్యులు బోనగం రమేష్ గౌడ్ ను అభినందించారు.వార్డ్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే వార్డ్ మెంబెర్ రమేష్ కు వార్డ్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బండి వేణు యాదవ్ పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** బెజ్జంకి మండలం గుగ్గిల గ్రామానికి చెందిన తిప్పరవేణి రాజయ్య 50 సంవత్సరాలు వృత్తి: వ్యవసాయం,శనివారం ఉదయం గ్రామస్తులతో కలిసి పిల్లి వాగు చెక్‌డ్యాం వద్ద చేపలు పట్టడానికి వెళ్లారు. చేపలు పట్టే సమయంలో ఏదో విషపురుగు కుట్టినట్లు భావించి, అనంతరం ఆయన నోటి నుండి నురుగు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు.మృతుని కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానం లేదని తెలియజేశారు. ఈ మేరకు మృతిని కుమారుడు పవన్ పిర్యాదు మేరకు పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు.

